## నెల్లూరు-చెన్నై హైవేని విస్తరించండి

పార్లమెంటులో ప్రస్తావించిన తిరుపతి ఎంపీ గురుమూర్తికలకత్తా ? చెన్నై జాతీయ రహదారి -16 నెల్లూరు నుంచి చెన్నై వరకు రహదారిని 4-లేన్ నుంచి 6-లేన్‌గా మార్పు చేయాలని ప్రత్యేక అధికరణ 377 ద్వారా తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పార్లమెంటులో ప్రస్తావించారు. ఇందులో బాగంగా ముఖ్యంగా కృష్ణపట్నం ఓడరేవు, శ్రీ సిటీ, మేనకూరు వంటి పారిశ్రామిక ప్రాంతాలుండడంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉందని ఎంపీ గుర్తు చేశారు. పారిశ్రామిక రవాణా వృద్ధి కారణంగా భారీగా సరుకులు తరలించడంతో పాటు 4-లేన్ రహదారి పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి సరిపోవడం లేదని సభ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీంతో ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం పెరిగాయని వివరించారు.


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం

స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము

ఉచిత న్యాయ సలహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 10-12-2024 సంపుటి : 06 సంచిక : 69 పేజీలు : 8 వెల : రూ 3-00


# ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం



### వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11సీట్లు కూడా రావు : హెూంమంత్రి వంగలపూడి అనిత

విజయవాడ,డిసెంబర్9 : వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఇప్పుడొచ్చిన 11 సీట్లు కూడా రావని హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం విజయవాడలోని సబ్‌జైల్‌ను పరిశీలించారు. అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి రావడం జరిగిందని, మౌలిక వసతులపై ఆరా తీశామని, జైలులో అధికారులపై వస్తున్న ఆరోపణలపై తనిఖీ చేయడం జరిగిందని ఆమె అన్నారు. జైలుఅధికారులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతోందని, రెండు రోజుల్లో నివేదిక వస్తుందని త్వరలో చర్యలు తీసుకుంటానమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విజయవాడలో హెూంమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తప్పులు బయటపడుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయసాయి తన స్థాయి.. వయసును మరిచిపోయి నోటికొచ్చినట్లు చిల్లరగా మాట్లాడుతున్నారని.. ఇది మంచి పద్ధతి కాదని.. ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నామని అన్నారు. విజయసాయి ఎన్ని రకాలుగా సీఎం చంద్రబాబును తిట్టినా.. బురద జల్లినా.. పవన్ కల్యాణ్‌కు.. తమకు మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నించినా.. ఏం చేసినా.. 'నిన్ను మాత్రం వదిలిపెట్టేదిలేదని' హెూంమంత్రి హెచ్చరించారు. విజయసాయి రెడ్డి ఎంతమంది వద్దకు వెళ్లి ఎన్ని రకాలుగా మాట్లాడినా, తన గురించి విమర్శలు చేసినా ఏం భయపడేదిలేదని హెూంమంత్రి అనిత స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, ప్రజల సొమ్ము తిన్నారని, ఆస్తులు కొల్లగొట్టారని.. ఈ అంశాలపై విచారణ జరుగుతోందని అన్నారు. ఏ తప్పు చేయకపోతే విజయసాయి రెడ్డికి భయమెందుకు.. ధైర్యంగా ముందుకొచ్చి విచారణ చేసుకోమని చెప్పాలన్నారు. అవన్నీ వదిలేసి చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని అనిత మండిపడ్డారు. తాము చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని.. అవన్నీ వదిలేసి టాపిక్‌ను డైవర్టు చేసే విధంగా మీడియా ముందు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదే విధంగా వైఎస్సార్‌సీపీ నేతలు వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఈ 11 సీట్లు కూడా రావని హెూమంత్రి అనిత జోష్యం చెప్పారు. రేషన్ బియ్యం అక్రమాలపై విచారణ జరుగుతోందని.. నిందుతులను వదిలిపెట్టేదిలేదని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బోరుగడ్డ అనిల్‌కు పోలీస్ స్టేషన్‌లో రాచమర్యాదలపై ఓ మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. ఆ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకున్నామని హెూంమంత్రి తెలిపారు.

# సమన్వయంతో పనిచేసి జిల్లాను ముందు స్థానంలో ఉంచండి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 09 – ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేసి అన్ని పారామీటర్లలో జిల్లాను ముందు ముందు స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో కోఆర్డినేషన్ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్యసాధనను అధికార బృందాలు క్షేత్రస్థాయిలో సమయస్ఫూర్తితో పనిచేసి అన్ని పారామీటర్లలో ముందుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఆర్డిఏ, డిఎంహెచ్వో ఇతర శాఖలు ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్య సాధనలో కుంటు పడిన అంశాలను తన దృష్టికి తీసుకువచ్చి సమీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ల సదస్సులో ప్రతి అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి గారు స్లాట్లు ఇచ్చి క్షుణ్ణంగా సమీక్షిస్తున్న నేపథ్యంలో అధికారులు నిర్దేశిత లక్ష్యసాధనపై




దృష్టి సారించి నివేదికలు ఇవ్వాలన్నారు. జిల్లాలో వరి, ఇతర ధాన్యపు పంట దిగుబడులను రోడ్లపై ఆరవేస్తున్నారని అకాల వర్ష కారణంగా ధాన్యం తడవకుండా రైతులను అప్రమత్తం చేయాలని విలేజ్ గ్రామ వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ పంట భీమా ప్రీమియం చెల్లింపు కింద వివిధ పంటలకు తక్కువ రుసుమును ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తే దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లిస్తుందన్న అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. తొలిరోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై 430 గ్రీవెన్స్ వచ్చాయని వీటన్నింటిని ఆన్లైన్ చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భూ సమస్యలతో పాటు స్వీకరించిన ఇతర సమస్యలను కూడా అదర్ సోర్సెస్ కింద అప్లోడ్ చేసుకుని పరిశీలించాలన్నారు. ఆదివారం జరిగిన జడ్పీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన దొర్నిపాడు బాయ్స్ హాస్టల్ సమీపంలో ఉన్న వైన్ షాపుపై చేసిన ఫిర్యాదుపై నిబంధనల ప్రకారం పరిశీలించి సంబంధిత మద్య దుకాణంపై వెంటనే నివేదికలు ఇవ్వాలని ఎక్సైజ్ సూపరిండెంటెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొవలని డిఆర్ఓ, ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. మెగా పేరెంట్ టీచర్ల సమావేశాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు సంబంధించి అధికారులను కలెక్టర్ అభినందించారు. జాయింట్ కలెక్టర్ సి విష్ణుచరణ్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల డేటాను కూడా వేగవంతం చేయాలన్నారు.

# వైసీపీ హయాంలో ఉపాధ్యాయులు, చిన్నారులపై మోయలేని భారం

### ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి ప్రజా రక్షకుడిగా జగన్ ఫోజు : మంత్రి అనగాని సత్యప్రసాద్

అమరావతి, డిసెంబర్9 : వైసీపీ హయాంలో విద్యార్థులు, ఉపాధ్యాయులపై మోయలేని భారాన్ని పెట్టి విద్యా వ్యవస్థను నాశనం చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. జగన్ కన్నా మహానటుడు ఎవరున్నారుని ప్రశ్నించారు. పదే పదే అబద్దాలు చెప్పడంతోపాటు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి కూడా ప్రజా రక్షకుడిగా ఫోజు పెట్టడం జగన్ లాగా ఎవరికైనా సాధ్యమవుతుందా అని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు హత్యలు, దాడులు, అక్రమ కేసులతో అరాచకపాలన సాగించి ఇప్పుడేమో ఏమీ జరగక్కున్నా మొసలి కన్నీరు కార్చడం ఆయనకు మాత్రమే సరిపోతుందని ఎద్దేవా చేశారు. విద్యా వ్యవస్థను దారిలో పెట్టి రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు చంద్రబాబు చేస్తున్న శ్రమను జగన్ నటన అంటుంటే ప్రజలంతా ఆయనను ఛీదరించుకుం టున్నారని అన్నారు. ఆయన చేతకాని తనం వల్లే పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతాలు ఘోరంగా పడిపోయాయని చెప్పారు. గాడితప్పిన విద్యా వ్యవస్థను యువ నేత నారా లోకేష్ అహర్నిషలు కష్టపడి దారిలో పెడుతుంటే చూసి సహించలేక పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా నటించడం మానేసి కూటమి ప్రభుత్వం మాదిరిగా ప్రజల సంక్షేమం కోసం పాటుపడటం జగన్ రెడ్డి నేర్చుకోవాలని అన్నారు. లేకుంటే ఇప్పటికి లెవెన్ రెడ్డిగా ఉన్న పెద్ద జీరో రెడ్డిగా మారిపోతావు...తస్మాస్ జాగ్రత అని హెచ్చరించారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేశారు: మంత్రి కింజరాపు అచ్చెనాయుడు

పార్వతీపురం మన్యం జిల్లా: గత ఐదు సంవత్సరాల్లో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడు ఆరోపించారు. మన్యం జిల్లాలో అచ్చెనాయుడు సోమవారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు పాల్గొన్నారు. నరిసిపురం వద్ద ఎన్టీఆర్ విగ్రహనికి పూల మాల వేసి కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యరాణి, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెనాయుడు మీడియాతో మాట్లాడుతూ...విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీటి, సాగునీటిపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అధికారుల సమీక్షాలో మంత్రి అచ్చెనాయుడు కీలక సూచనలు చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది కానీ సేవలు అందించేందుకు అధికారులు కరువయ్యారని అన్నారు.

### సీఎం చంద్రబాబుకు బొత్స సత్యనారాయణ ధన్యవాదాలు

అమరావతి, డిసెంబర్9 ): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నేతలు ఎన్నో మాటల తూటాలు పేలారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను కూడా ఎన్నో సార్లు తప్పుబట్టారు. వైసీపీ పాలనే బెటర్ అంటూ పోకడలకు పోయారు కూడా. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను ఉద్దేశిస్తూ ఎమ్మెల్సీ బొత్స సత్యానారాయణ పలు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. వైసీపీ హయాంలో నాడు- నేడు కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో కనిపించాయంటూ కామెంట్స్ చేశారు. బొత్స ఇంకా మాట్లాడుతూ.. విశాఖలో డ్రగ్స్ వ్యవహారంపై తాను మళ్ళీ కేంద్రానికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. "డ్రగ్స్‌కు సంబంధించి మాపై విష ప్రచారం చేశారు.. ఎన్నికల్లో లబ్ధి పొందారు" అంటూ విరుచుకుపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు. వర్షాల నేపథ్యంలో రైతాంగం ఇబ్బందులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల13 వ తేదీన అన్ని కలక్టరేట్‌లో వినతిపత్రలు అందజేస్తామన్నారు. ఈనెల 27వ తేదీన విద్యత్ చార్జీలు పెంపుపై విద్యుత్ కార్యాలయాలలో వినతిపత్రలు అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి.

### --జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 09 - - రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ




తీసుకోవాలన్నారు. పెండింగులో ఉన్న 927 దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తొమ్మిది రీఓపెన్ కేసులను సాయంత్రంలోగా క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చి పెండింగులో వున్న ఒక్క సమస్యను కూడా క్లియర్ చేయాలన్నారు. 24, 48,72 గంటలలో పరిష్కరించాల్సిన సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్లో మొదటి అంశమే పిజిఆర్ఎస్ రెడ్రసల్ పై సమీక్ష ఉంటుందని ఈ రెండు రోజుల్లో పరిష్కరించాల్సిన సమస్యలన్నింటిని పరిష్కరించి అప్లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 141 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# బియ్యం దోపిడీ ముఠా ఆటకట్టించేందుకు సిట్

### అందరి కళ్లుగప్పి విదేశాలకు బియ్యం తరలింపు ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

అమరావతి, డిసెంబర్9 : రాష్ట్ర ప్రభుత్వం నియమించిన " సిట్" పేదల బియ్యం దోపిడీ ముఠా ఆట కట్టిస్తుందని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. కాకినాడ పోర్టులో కూలీలకు పని కల్పించడం అంటే అక్రమ అవినీతి బియ్యం వ్యాపారంతో కాదు, సక్రమమైన ఎగుమతులు - దిగుమతుల వ్యాపారంతో అనే విషయాన్ని గుర్తు పెట్టుకొవాలని అన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం పేదలకు ఆకలి తీర్చాలని రెట్టింపు బియ్యం ఇస్తే, కాకినాడ పోర్టు నుంచి రెట్టింపు బియ్యం విదేశాలకు వెళ్లిందని లెక్కలు చెబుతున్నాయన్నారు. పేదల బియ్యం దోపిడీ పైన "సిట్" అనగానే కలుగులో ఉన్న అవినీతిపరులు స్టాండ్, అటెన్షన్ అండ్ రన్ అనే పరిస్థితికి వచ్చారని చెప్పారు..ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బియ్యం ఎగుమతి చేస్తున్న నౌకను ఆపడం వెనక ఉన్న స్ఫూర్తి ముఖ్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం పేదలకు ఉచిత బియ్యం కోసం సంవత్సరానికి సగటున రూ.16 వేల కోట్లు వెచ్చిస్తున్న నిధులు దుర్వినియోగం కావడం బాధాకరమని తెలిపారు. ప్రస్తుతం దాదాపు రూ.10 వేల కోట్లు కేంద్రానికి, రూ.6 వేల కోట్లు రాష్ట్రానికి ఉచిత బియ్యం కోసం వ్యయం అవుతుందని అన్నారు. "గడచిన ఐదేళ్లలో మొత్తం రూ.80 వేల కోట్లు ఖర్చు అయితే కేంద్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు ఖర్చు అయ్యింది. 2019 - 24 మధ్య పేదలకు అందాల్సిన రూ.80 వేల కోట్ల ఉచిత బియ్యంలో సింహ భాగం అవినీతిపరులకు ఆదాయ మార్గంగా మారింది. పేదల ఆకలి తీర్చాల్సిన బియ్యం దోపిడీతో వారి కడుపు కొట్టి జేబులు నింపుకోవాలని చూస్తున్నారు. అర్హులైన పేదల ఆకలి తీరేవిధంగా బియ్యం పంపిణీలో సంస్కరణలు సూచించాల్సిన అవసరం ఉంది.

# సంపాదకీయం

మంగళవారం 10-12-2024

## ఆ నోట్ల కట్టలు ఎక్కడివి...

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అదానీ వివాదంపై విపక్షాలు రచ్చ రచ్చ చేస్తున్న వేళ ఉభయసభలు వరుసగా వాయిదా పడుతున్నాయి. ఇలాంటి తరుణంలో రాజ్యసభలో సంచలన పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ కి కేటాయించిన సీటులో భారీగా 500 నోట్ల కట్టలు దొరికాయిశీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో సీటు నెంబర్ 222 వద్ద నోట్ల కట్ట దొరకడం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది.రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించిన సీటు కావడంతో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. రాజ్యసభ ఛైర్మన్ ఆ నోట్ల కట్ట వ్యవహారంపై విచారణకు ఆదేశించినట్టు ప్రకటించగా.. ఆ నోట్ల కట్టకు, తనకు సంబంధం లేదని ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ వివరణ కూడా ఇచ్చారు. ఇప్పుడు తాజాగా వెలుగుచూసిన 'నోట్ల కట్ట' ఉదంతం తర్వాత ఎలాంటి మార్పులు జరుగుతాయోనన్న చర్చ కూడా మొదలైంది.ఇటీవల కాలంలో పార్లమెంట్ లో సభ కార్యకలాపాలు ముగిసిన తర్వాత సీటు నంబర్ 222 నుండి నోట్ల కట్ట కనిపించింది. ఇది రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ ప్రకటన. డిసెంబర్ 6, శుక్రవారం, పార్లమెంట్ శీతాకాల సమావేశాల 10వ రోజు. కార్యక్రమాలు ప్రారంభమైన వెంటనే జగ్‌దీప్ ధన్‌ఖర్ చేసిన ఈ ప్రకటనతో పార్లమెంట్‌లో పెద్ద దుమారం చెలరేగింది. గందరగోళం ఎంతగా పెరిగిందంటే ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపించాలని రాజ్యసభ ఛైర్మన్ కోరారు.సభా కార్యకలాపాలు డిసెంబర్ 5న ముగియగానే సీటు నంబర్ 222 వద్ద నోట్ల కట్ట కనిపించిందని ఛైర్మన్ తెలిపారు. ఈ సీటును కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించారు. రూ.500 నోట్లు 100 నోట్లు ఉన్నట్లు తెలుస్తోందని రాజ్యసభ ఛైర్మన్ తెలిపారు. కాగా, తాను పార్లమెంటుకు రూ.500కు మించి తీసుకుని రానని సింఘ్వీ చెప్పారు. పార్లమెంట్ సభ్యులు తమ వెంట సభ లోపలికి డబ్బులు తీసుకెళ్లడంపై ఎలాంటి నిషేధం లేదు. అయితే ఆ డబ్బును సభలో ప్రదర్శించడంపై మాత్రం ఆంక్షలు, నిబంధనలు అమలవుతున్నాయి. ఇందుకు 2008లో జరిగిన "ఓటుకు నోటు" వివాదమే కారణం. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (ఐఖం) ప్రభుత్వం అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకుంది. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సీపీఐ(ఎం) ఈ కూటమికి మద్దతును ఉపసంహరించుకుంది. దీంతో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టగా.. దాన్నుంచి గట్టెక్కడం కోసం నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రత్యర్థి క్యాంపు ఎంపీలకు లంచం ఇచ్చి వ్యతిరేకంగా ఓటు వేయకుండా వ్యూహం రచించింది. ఈ ప్రయత్నాన్ని బీజేపీ ఎంపీలు బయటపెడుతూ.. సభలోపలకు నోట్ల కట్టల సంచిని తీసుకొచ్చి సభ జరుగుతుండగానే వాటిని ప్రదర్శించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల అవినీతి, నేతలు అమ్ముడుపోవడం వంటి పలు అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో కథనాలు వెలువడ్డాయి. సభ లోపల జరిగే తంతు దేశ ప్రతిష్టకు భంగం కలిగించకుండా ఉండడం కోసం అప్పటి నుంచి పెద్ద మొత్తంలో డబ్బును సభ లోపలికి తీసుకెళ్లకుండా నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చారు.ఇంత రచ్చకు కారణమైన నోట్ల కట్టకు సంబంధించి పార్లమెంట్‌లో ఎలాంటి నిబంధనలు ఉన్నాయో తెలుసుకుందాం.. ఎంపీలు తమ వెంట ఎంత డబ్బు తీసుకెళ్లవచ్చు, వారిని పార్లమెంటుకు తీసుకెళ్లకుండా నిషేధం ఎందుకు విధించారో కూడా చూద్దాం.నోట్ల కట్టలు తెచ్చుకుని రచ్చ సృష్టిస్తున్నా.. దీనికి సంబంధించి ఎలాంటి నిబంధనలు లేవు. ఏ ఎంపీ అయినా ఎంత డబ్బుతో అయినా సభలోకి రావచ్చు. పార్లమెంట్ హౌస్ లోపల ఆహార దుకాణాలు, బ్యాంకులు కూడా ఉన్నాయి. చాలా మంది నాయకులు ఈ బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేస్తూనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంటు లోపల నోట్లను తీసుకెళ్లడం నిబంధనలకు విరుద్ధం కాదు. అయితే, సభ లోపల పెద్ద మొత్తంలో డబ్బును ప్రదర్శించడం ఖచ్చితంగా నిషేధం. పార్లమెంటు లోపల డబ్బును ఉపయోగించడం లేదా ప్రదర్శించడం దాని గౌరవాన్ని దెబ్బతీస్తుంది. 2008లో బీజేపీ ఆ సంవత్సరం కరెన్సీ నోట్లను తీసుకుని పార్లమెంటుకు చేరుకున్నప్పుడు ఈ నిబంధన మరింత పటిష్టంగా అమలు చేయబడింది.ఎంపీలు చిన్న పర్సు లేదా అవసరమైన వ్యక్తిగత వస్తువులతో కూడిన బ్యాగ్ వంటి వ్యక్తిగత వస్తువులను తీసుకెళ్లడానికి అనుమతించబడతారు. సభ పనితీరుపై ప్రభావం చూపనంత కాలం. మహిళా ఎంపీలు హ్యాండ్‌బ్యాగ్‌లు తీసుకెళ్లేందుకు అనుమతించారు. కానీ అది వ్యక్తిగత అవసరాలకు మాత్రమే ఉపయోగించాలనే షరతుపైనే. వ్యాలెట్లు లేదా చిన్న బ్యాగ్‌లను తీసుకెళ్లడంపై ఎటువంటి పరిమితి లేదు, ఇవి ప్రొసీడింగ్‌లకు ఆటంకం కలిగించవు.శాసన ప్రయోజనాల కోసం అవసరమైన పత్రాలు, గమనికలు, నివేదికలు లేదా బిల్లులు తీసుకెళ్లడానికి అనుమతించబడతాయి.స్పీచ్ పేపర్: డిబేట్ లేదా డిస్కషన్‌లో పాల్గొనేందుకు సిద్ధం చేసిన స్పీచ్ పేపర్ఎలక్ట్రానిక్ పరికరాలు: ఎంపీలు ముందస్తు అనుమతి తర్వాత మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లను తమ వెంట తీసుకెళ్లవచ్చు.రిఫ్రెష్‌మెంట్స్: ప్రొసీడింగ్ సమయంలో నీరు, తేలికపాటి స్నాక్స్ అనుమతించబడతాయి.అసభ్యకరమైన లేదా అనుచితమైన అంశాలు: సభకు లేదా దాని కార్యకలాపాలకు అవమానకరంగా భావించే ఏదైనా ఖచ్చితంగా నిషేధించబడింది.నిరసన మెటీరియల్: నిరసన కోసం ఉపయోగించే ప్లకార్డులు, పోస్టర్లు లేదా బ్యానర్లు వంటి వస్తువులను పార్లమెంటు లోపలికి తీసుకెళ్లకూడదు.పెద్ద మొత్తంలో నగదు: నగదు కట్టలు, ముఖ్యంగా పెద్ద మొత్తంలో తీసుకెళ్లడం ఖచ్చితంగా నిషేధించబడింది.అనధికార ఎలక్ట్రానిక్ పరికరాలు: రికార్డింగ్ లేదా ఫోటోగ్రాఫ్ తీయడానికి ఉపయోగించే పరికరాలను అనుమతి లేకుండా పార్లమెంట్ లోపల తీయకూడదు

## లహరి రాఘవేంద్ర కు ఇదివరకే పరిచయం

### నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 09 – – గతంలో అమ్మాయి అబ్బాయి పరిచయం ఉంది వెల్దుర్తి మండలం లో చదువు కున్నారు అని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నందికొట్కూరు బైరెడ్డి నగర్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు .అనంతరం జిల్లా ఎస్పీ గారు మీడియాతో మాట్లాడుతూలహరి నందికొట్కూరులో ఇంటర్మీడియట్ చదువుతుంది..గతంలో అమ్మాయి,అబ్బాయికి పరిచయం ఉంది ఇద్దరు వెల్దుర్తి మండలంలో చదువుకున్నారు, అమ్మాయి వాళ్ళ తాత ఇంట్లో ఉంటూ చదువుకోవడానికి వచ్చింది.లహరి మరియు రాఘవేంద్రలు ఇద్దరూ మంటలలో




కాలిపోవడం జరిగిందని అయితే లహరి ఇంటి వద్దనే చనిపోగా రాఘవేంద్రకు 30 నుండి 40 శాతం వరకు కాలిన గాయాలతో హాస్పిటల్లో చికిత్స నిమిత్తం చేర్పించడం జరిగిందన్నారు .అమ్మాయిని హాస్పిటల్ కు పోస్ట్ మార్టం నిమిత్తం తరలించడం జరిగింది. మంటలు రావడానికి గల కారణాలపై క్లూస్ టీం దర్యాప్తు చేస్తుంది.సంఘటన స్థలంలో అన్ని క్లూస్ సేకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ. సీఐలు ఎస్సై లు పోలీసులు ఉన్నారు.

## నంద్యాల ఐఎంఏ వైద్యుల ముందస్తు క్రిస్మస్ వేడుకలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 09 – ఐఎంఏ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక కార్మెల్ చర్చి లో ఆదివారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు అధ్యక్షతన,నిర్వాహక కమిటీ సభ్యులు వైద్యులు రాజశేఖర్ ,ఫ్రాంక్ మోహన్, కిషోర్, సచిన్ సుమంత్, రూఫస్ నిర్వహణలో జరిగిన ఈ ఉత్సవాలకు హైదరాబాద్ కు చెందిన ప్రముఖ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చిన్న బాబు ముఖ్య వక్తగా ,ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి .రవి కృష్ణ, పాస్టర్ పాల్ వీరాంజనేయులు అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలలో డాక్టర్ సచిన్ సుమంత్, డాక్టర్ కిషోర్ బృందం, కీబోర్డ్ పై కిరణ్ అందించిన సంగీత సహకారంతో ఆలపించిన క్రిస్మస్ కరోల్స్ పాటలు ఆహుతులను అలరించాయి.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ నంద్యాల భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. సంక్రాంతి సంబరాలు,రంజాన్ ఇఫ్తార్, క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం ఐకమత్యానికి దోహదం చేస్తుందని అన్నారు.మీ శత్రువులను కూడా ప్రేమించండి, నిన్ను ద్వేషించు వారి కొరకు ప్రార్థించండి అన్న అత్యున్నత క్షమాగుణాన్ని,ప్రేమ తత్వాన్ని జీసస్ ప్రబోధించారని అన్నారు. డాక్టర్ రాజశేఖర్ రచించిన ప్రత్యేక క్రిస్మస్ గీతాన్ని ఆవిష్కరించారు. ముఖ్య వక్త గా పాల్గొని సందేశం ఇచ్చిన డాక్టర్ చిన్న బాబును ఐఎంఏ నంద్యాల తరపున సత్కరించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల ఐఎంఏ వైద్యులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రాణి ప్రమీల ,డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కిషోర్, డాక్టర్ ఫ్రాంక్ మోహన్, డాక్టర్ సచిన్ సుమంత్, డాక్టర్ డాక్టర్ ఎస్తేర్ కిషోర్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రూఫస్, డాక్టర్ నిస్సీ రూపస్,డాక్టర్ రేచల్, డాక్టర్ కిరణ్మయి,డాక్టర్ వినోద్ డాక్టర్ ప్రతిభా గ్లోరీ, డాక్టర్ రాబర్ట్ కెనడి , కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

## కనికరం లేని కన్నకొడుకులు... అన్నితానైన స్ఫూర్తి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:–నవంబర్ 9 కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన రాములమ్మ అందరు ఉండి కూడా అనాధల రోడ్డుపై ఉండగా స్ఫూర్తి సేవా సమితి బృదం పురుగులు పట్టిన రాములమ్మ చేతి గాయానికి మూడు నెలలపాటు సపర్యలు చేసి సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రాములమ్మ విషయంలో అన్ని విధాలుగా అండగా నిలిచిన మదీనా క్లినిక్ మౌలాలి కి, వారి సిబ్బందికి, స్ఫూర్తి దాతలకు, ఆశ్రయం ఇచ్చిన పద్మావతి, కాశీనాయన సేవాశ్రామాల నిర్వాహకులకి స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. కన్న కొడుకులు పట్టించుకోకపోయినా ఆదుకున్న స్ఫూర్తి టీమ్ కి రాములమ్మ కన్నీటి కృతజ్ఞతలు తెలియజేశారు. దేవుడు ఇచ్చిన అవకాశాన్ని మేము నిర్వర్తించామని స్ఫూర్తి మధు అన్నారు.

## 11 కెవి లైన్ సిట్టింగ్ కారణంగా...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:–నవంబర్ 9 మంగళవారం డోన్ టౌన్ సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం మరియు ఎల్ బండ ఫీడర్ల కింద 11 కెవి లైన్ షిఫ్టింగ్ కారణంగా అబ్బిరెడ్డిపల్లె,బొంతిరాళ్ల,వెంకటాపురం, గుమ్మకొండ, ఉడుములపాడు గ్రామాలకు ఇచ్చే త్రిఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి 2 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు కరెంటు ఉండదని ఏఈ నాగేశ్వర రెడ్డి తెలియజేశారు.



## జిల్లా పోలీసులకు 70 ఫిర్యాదులు ...

### విచారణ జరిపి చట్ట పరిదిలో న్యాయం చేస్తాం....

### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 09 – నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ .యుగంధర్ బాబు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో పాల్గొని 70 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలి. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" కార్యాక్రమంలో సివిల్ తగాదాలు,కుటుంబ కలహాలు, అత్తారింటి వేదింపులు,ఉదోగం ఇప్పిస్తానని మోసాలు,అన్నదమ్ముల ఆస్థి పంపకాలలో మనస్పర్ధలు మొదలగునవి ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ . యుగంధర్ బాబు గారితో పాటు ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగిస్తున్నాం

### నిరంజన్ రెడ్డి కమిషనర్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 09 – కాలువల పై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆయన పట్టణంలో పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల ఆక్రమణలు తొలగించాం. కాలువలపైనా ఎవరూ నిర్మాణాలు చేపట్ట కూడదు. దుకాణ దారులు కాలువ లపైన సామాగ్రిని ఉంచొద్దు. ఎవరైనా రోడ్లను కాల్వలను ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. నిరంతరం అక్రమణలపైన నిఘా ఉంటుందని తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఎమ్ ఈ గురప్పయాదవ్. శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. ఇన్ స్పెక్టర్ లక్ష్మి నారాయణ. శివప్రసాద్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. వేస్టు ను ఎప్పటికప్పుడు డంప్ యార్డుకు తరలించాలని చెప్పారు.

## జిల్లా సీడ్స్ ఆఫీస్ ను సందర్శించిన సీడ్స్ ఛైర్మన్ మన్నే సుబ్బారెడ్డి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:–నవంబర్ 9 సోమవారం కర్నూలులో జిల్లా సీడ్స్ ఆఫీస్ ను మరియు సంబంధిత ల్యాబ్ ,గోడౌన్స్ ను సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి జిల్లాలోని రైతులకు సకాలంలో నాణ్యమైన సీడ్స్ ను అందించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# చిన్నారులు ఏమౌతున్నారు...

## ఎన్‌హెచ్‌ఆర్సీ సూటి ప్రశ్న

విజయవాడ, డిసెంబర్ 9,ఏపీలో చిన్నారుల మిస్సింగ్ ఇష్యూపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్ అయ్యింది. ఈ వ్యవహారంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఏపీ సీఎస్ వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. గతంలో కోరిన నివేదిక ఇవ్వని కారణంగా ఎన్‌హెచ్‌ఆర్సీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో చిన్నారుల మిస్సింగ్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. 3 వేల మంది బాలికలు తప్పిపోయిన ఇష్యూకు సంబంధించి నివేదిక ఇవ్వాలని గతంలో ప్రభుత్వానికి (సీఎస్, డీజీపీ)కి ఆదేశాలు ఇచ్చినట్టు స్పష్టం చేసింది. అయినా అందుకు సంబంధించి నివేదికను ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేసింది.అందుకే ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరవ్వాలని.. ఎన్‌హెచ్‌ఆర్సీ సమన్లు జారీ చేసింది. 20.01.2025న కమిషన్ ముందు అవసరమైన సమాచారం, వివరాలతో వ్యక్తిగతంగా హాజరవ్వాలని స్పష్టం చేసింది. అయితే.. 14.01.2025 లోపు సమగ్ర నివేదిక అందజేస్తే.. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఉంటుందని.. జాతీయ మానవ హక్కుల కమిషన్ వెల్లడించింది.న్యాయవాది, సామాజిక కార్యకర్త ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. ఓ పత్రికలో ప్రచురించిన వివరాలను ఫిర్యాదుకు జత చేశారు. ఫిర్యాదు ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో 3 వేల మంది బాలికలు అదృశ్యమయ్యారని పేర్కొన్నారు. ప్రతిరోజూ 8 మంది కంటే ఎక్కువ మంది బాలికలు తప్పిపోయారని వివరించారు. 2022లో డేటా ప్రకారం.. వారిలో చాలామంది ఆచూకీ తెలియలేదన్నారు.దాదాపు 371 మంది తప్పిపోయిన బాలికల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని.. ఫిర్యాదుదారు ఆరోపించారు. రాష్ట్రంలో మొత్తం 3,592 మంది బాలికలు అదృశ్యమయ్యారు. వారిలో 3,221 మంది బాలికల ఆచూకీ లభించింది. ఈ ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో అవసరమైన ప్రతిస్పందనను పన్నెండు వారాల్లోగా సమర్పించాలని సీఎస్, డీజీపీని ఆదేశించింది.2022, 2023, 2024 సంవత్సరాల్లో తప్పిపోయిన పిల్లల సమగ్ర స్థితి నివేదికను 18-06-2024 తేదీన ఆంధ్రప్రదేశ్ అదనపు డీజీపీ వీడియో లెటర్ ద్వారా సమర్పించారు. కానీ.. సీఎస్ నుంచి ఎలాంటి నివేదిక రాలేదు. దీంతో సీఎస్ వ్యక్తిగతంగా హాజరవ్వాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సమన్లు జారీ చేసింది.

# 7వరోజు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము "మీకోసం మీ వేనిగండ్ల"ఉదయపు పర్యటన

ప్రధాన రహదారుల్లోని దుకాణదారులు, చిరు వ్యాపారులతో ముఖాముఖిగా మాట్లాడిన ఎమ్మెల్యే

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

వ్యాపారులు తీరు మార్చుకోకుంటే.. జరిమానాలు తప్పవని హెచ్చరిక:ఎమ్మెల్యే

గుడివాడ డిసెంబర్ 09 గుడివాడ పట్టణంలో పారిశుధ్ధ్య మెరుగుకు ప్రతి ఒక్కరు తమ సహకారం అందించాలని, రోడ్లు వెంబడి దుకాణదారులు, చిరు వ్యాపారులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని...నిర్లక్ష్యం వహించే వారికి జరిమానాలు తప్పవని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హెచ్చరించారు. గుడివాడ పట్టణంలో పారిశుధ్య మెరుగుకు... ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిర్వహిస్తున్న "మీకోసం మీ వెనిగండ్ల" ఉదయపు పర్యటనలు 7వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై పర్యటించిన ఎమ్మెల్యే రాము.. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్ధ్య మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎక్కడికక్కడ రోడ్ల వెంబడి చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు.ప్రధాన రహదారులు వెంబడి పలు దుకాణాల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో.. సంబంధిత దుకాణదారులు, చిరు వ్యాపారులను ఎమ్మెల్యే రాము సున్నితంగా హెచ్చరించారు.మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకుంటేనే పారిశుధ్య మెరుగుకు.. పురపాలక సంఘం చేస్తున్న కృషికి ఫలితం ఉంటుందని వ్యాపారులస్తులతో ఎమ్మెల్యే రాము అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ గుడివాడ పట్టణ అభివృద్ధి, పారిశుధ్య మెరుగు కోసం ఉదయపు పర్యటనలు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు. కొందరి నిర్లక్ష్యం వల్ల ఎంత కష్టపడిన ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. ఇక ఉపేక్షించేది లేదని పారిశుధ్య సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై జరిమానాలు విధిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము హెచ్చరించారు.ఎమ్మెల్యే రాము పర్యటనలో టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు, ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

# అలరించిన నేవీ బ్యాండ్ మ్యూజిక్

విశాఖపట్నం,విశాఖ సాగరతీరంలో నేవీ బ్యాండ్ మ్యూజిక్ హోరెత్తింది. 57వ సబ్ మెరైన్ దినోత్సవం సందర్భంగా నేవీ సిబ్బంది లైవ్ మ్యూజిక్ తో ప్రజలను అలరించారు.ఆకట్టుకునేలా నేవీ సిబ్బంది మ్యూజిక్ కు ప్రజలు మైమరిచిపోయారు.సాయంత్రం వెళ సాగరతీర అందాలను తిలకించేందుకు వచ్చే ప్రజలను నేవీ మ్యూజిక్ కట్టిపడేసింది.కెరటాలతో పోటీ పడుతూ నేవీ సిబ్బంది వాయిద్యాల నుంచి పుట్టుకొచ్చిన మ్యూజిక్ హైలేట్ గా నిలిచింది.ఈ మ్యూజిక్ ను నేవీ అదికారులు కూడా తిలకించారు.నేవీ సిబ్బంది మ్యూజిక్ కార్యక్రమంతో ఆర్కెబీచ్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

# రుషికొండ ప్యాలస్ ను మ్యూజియంగా మార్చాలి

విశాఖపట్నం వందల కోట్ల ప్రజాధనం తో గత ప్రభుత్వ హయాంలో నిర్మిం చిన రుషికొండ ప్యాలెస్ భవనాల ను సద్వినియోగపరిచే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టాలని విశాఖలో బుద్దిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ కోరింది.ఈమేరకు విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మె ల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ ను కలిసి సభ్యులు వినతి పత్రాన్ని అందిం చారు.అనంతరం సభ్యులు వెంకట రమణ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేకంగా మ్యూజియం లేదని, ఈ భవనాన్ని మ్యూజియంగా ఏర్పాటు చేయాలనీ కోరారు.

# ఆదిమూలపు మిస్సింగ్ ...

ఒంగోలు, డిసెంబర్ 9, ఉమ్మడి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని సీన్. 2019లో 151 సీట్లతో వైసీపీ విజయం సాధించాక.. ఐదేళ్ల పాటు మంత్రి పదవి అనుభవించిన ఆదిమూలపు సురేష్.. ఎక్కడంటూ వైసీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నారట. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించటంతో పాటు విద్యాశాఖ, మున్సిపల్ శాఖల మంత్రిగా పనిచేసిన సురేష్.. కనిపించిన దాఖలాలు లేవంటూ సొంతనియోజకవర్గంలో చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో ఘోర ఓటమి చెందటంతో తన మూలాలను కాపాడుకునేందుకు పోటీ చేసిన చోట కాకుండా.. పక్క నియోజకవర్గంపై ఆయన దృష్టి సారించారనే వార్తలు గుప్పుమంటున్నాయి.గత ఎన్నికల్లో సురేష్‌ను.. జఅఖ అధిష్టానం యర్రగొండపాలెం నుంచి కొండపి నియోజకవర్గానికి బదిలీ చేసింది. ఆ నియోజకవర్గంలో ఓటర్లు ఆయన్ను ఆదరించలేదు. 2009లో యర్రగొండపాలెం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదిమూలపు స్థానం మార్చుకుని 2014లో సంతనూతలపాడు నుంచి జఅఖ టికెట్‌పై పోటీ చేసి గెలుపొందారు. 2019లో సంతనూతలపాడు సిట్టింగ్ స్థానం వదిలి తిరిగి యర్రగొండపాలెం నుంచి వైసీపీ తరుపున విన్ అయ్యారు. గత ఎన్నికల్లో మాత్రం కొండపి వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి.. ప్రస్తుత మంత్రి బాల వీరాంజనేయస్వామి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. అక్కడ నుంచి సీన్ మొత్తం మారిందని టాక్ నడుస్తోంది.ఎన్నికల్లో ఓడిన నాటి నుంచీ మాజీమంత్రి.. నియోజకవర్గానికి చుట్టంచూపుగా పరిమితం అయ్యారు. ఈ మాట స్వయంగా వైసీపీ శ్రేణులే చర్చించుకుంటున్నారట. ఫుల్ టైమ్ కొండపి బాధ్యతలను ఆదిమూలపు సురేష్ చూడటం లేదని క్యాడర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత సింగరాయకొండలోని వైసీపీ ఆఫీస్ ఎత్తేశారట. తాడేపల్లిలో జరిగే ప్రెస్ మీట్లు తప్ప.. జిల్లాలో జరిగే పార్టీ యాక్టివిటీస్‌లో ఎక్కడా సురేష్ కనిపించటం లేదని నియోజకవర్గంలో టాక్ నడుస్తోంది. మరోవైపు ఆయన హైదరాబాద్‌కే పూర్తిగా పరిమితం అయ్యారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు కొండపి నియోజకవర్గం తనకు వర్కౌట్ కాదని.. తన సన్నిహితులతో సురేష్ చర్చించినట్లు తెలుస్తోంది. గతంలో కలిసొచ్చిన సంతనూతలపాడే బెస్ట్ అనే ఆలోచనలో మాజీమంత్రి ఉన్నట్లు సమాచారం. యర్రగొండపాలెంకు తిరిగి వెళ్లాలని ఆశ ఉన్నా.. అది తనకు సెట్ కాదనే యోచనలో సురేష్ ఉన్నట్లు టాక్ నడుస్తోంది.ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దర్శి, యర్రగొండపాలెం.. రెండు నియోజకవర్గాల్లోనూ వైసీపీ జెండా రెపరెపలాడింది. దీంతో ఆ రెండు నియోజకవర్గాల్లో సురేష్‌కు నో ఛాన్స్. అందుకే మాజీమంత్రి.. సంతనూతలపాడుకు షిఫ్ట్ కావాలని యోచనలో ఉన్నట్లు పొలిటికల్ వర్గాల టాక్ . ప్రస్తుత సంతనూతలపాడు వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా మాజీమంత్రి మెరుగు నాగార్జున కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లో నాగార్జున.. వేమూరు నుంచి సంతనూతలపాడు షిఫ్ట్ అయ్యి.. ఓటమి చెందారు. తర్వాత ఆయన అటు కన్నెత్తి కూడా చూడలేదట. తాజాగా వైసీపీ అధిష్టానం ఆయన్ను బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా నియమించింది. దీంతో ఆయన మళ్లీ సొంత నియోజకవర్గంలో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారట. ప్రస్తుత వేమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా వరికూటి అశోక్ బాబు ఉండగా.. ఆయన కూడా కొండపి వైపే చూస్తున్నారట. దీంతో ఆ నియోజకవర్గంలో మూడుముక్కలాట సాగుతోందనే వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు.. వరికూటి కూడా కొండపి వస్తే మరోసారి గ్రూపు రాజకీయాలకు అవకాశం లేకపోలేదని సొంత పార్టీలో చర్చ సాగుతోందట.మరోవైపు..కొండపి నియోజకవర్గంలో నిలదొక్కుకునేందుకు వైసీపీ చేయని ప్రయత్నాలు లేవని రాజకీయ వర్గాల్లోనూ టాక్ నడుస్తోంది.

అక్కడ ఎలాంటి ఫార్ములా ప్రవేశపెట్టినా.. ఫ్యాన్ పార్టీ సక్సెస్ కావటం లేదనే టాక్ ఉంది. నియోజకవర్గంలో ప్రస్తుతం టీడీపీ నుంచి మంత్రి బాలవీరాంజనేయ స్వామి స్ట్రాంగ్‌గా ఉన్నారు. ఓ రకంగా చెప్పాలంటే కొండపిలో ఆయన పాతుకుపోయారంటే అతిశయోక్తి కాదేమో. అక్కడ నుంచి మూడుసార్లు గెలిచిన ట్రాక్ రికార్డు కూడా ఆయన సొంతం. మరోవైపు.. స్వామికి.. దామచర్ల సత్య కుటుంబం అండగా ఉంది. ఆర్థికంగా, సామాజికంగా దామచర్ల కుటుంబం సపోర్ట్ ఉండటంతో.. వైసీపీలో ఏ నేతా.. కొండపి బాధ్యతలు చేపట్టినా ప్రత్యర్థిగా ఉంటున్న స్వామిని ఢీకొట్టలేకపోతున్నారనే వాదన ఉంది.అందుకే ఆ నియోజకవర్గంలో వైసీపీ బాధ్యతలను కొత్తవారికి ఇచ్చేందుకు అధిష్టానం వ్యూహాలు రచిస్తోందట.ఆదిమూలపు సురేష్.. సంతనూతలపాడు షిఫ్ట్ కావటం కన్ఫామ్ అయితే.. కొండపి వైసీపీ ఇన్‌ఛార్జ్ పదవి ఖాళీ అవుతుంది. ఆ స్థానం కోసం వైసీపీ నేతలు జూపూడి ప్రభాకరరావు, మాదాసి వెంకయ్య లైన్‌లో ఉన్నారు. వేమూరు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న వరికూటి అశోక్ బాబు.. తనకు వేమూరు నుంచి టిక్కెట్ కావాలని పట్టు పడుతున్నట్లు సమాచారం. ఎన్నికలకు చాలా సమయం ఉండటంతో.. వైసీపీ అధిష్టానం నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయోననే ఉత్కంఠ ఉంది.ఇప్పటికే నియోజకవర్గాల్లో నేతల మార్పిడి అంశం.. ఎన్నికల్లో స్పష్టంగా కనిపించిందని రాజకీయవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాజీమంత్రి ఆదిమూలపు సురేష్ నియోజకవర్గం మారితే.. ఆ ఎఫెక్ట్ మిగతా నియోజకవర్గాల్లోనూ పడే అవకాశం లేకపోలేదనే టాక్ పొలిటికల్ వర్గాల్లో సాగుతోందట. ఈ నేపథ్యంలో అధినేత జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి నెలకొంది.

# కొడాలిపై కేసులు తిరగదోడుతున్న పోలీసులు



విజయవాడ, డిసెంబర్ 9, వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం బూతులతో విపక్ష నేతలపై చెలరేగిపోయిన మాజీ మంత్రి, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు అప్పుడప్పుడూ బయటకు వచ్చి కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నా.. ఆయన మాటల్లో ఇది వరకటి ఫైర్ కనిపించడం లేదు. కేసుల భయంతోనే ఆయన సైలెంట్ అవుతున్నారన్నది ఓపెన్ సీక్రెట్టే. కొడాలి నాని సైలంట్ మోడ్లో ఉన్నంత మాత్రాన మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ ఛాప్టర్లో ఆయన పేజీ చిరిగిపోలేదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. కొడాలి నాని అనుచరులను పోలీసులు వరుసగా అరెస్టులు చేస్తున్నారు. అధికారంలో ఉండగా ఆ మాజీ మంత్రి గ్యాంగ్ చేసిన అరాచకాలపై పోలీసులు చర్యలు చేపట్టారు. తాజాగా 9 మంది కొడాలి నాని అనుచరులను గుడివాడ పోలీసులు అరెస్ట్ చేశారు. 2022 డిసెంబర్‌లో వార టీడీపీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు వస్త్ర దుకాణంపై పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేసి అరాచకం సృష్టించారు. అప్పట్లో దానిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు.ఆ కేసుని తిరగదోడిన పోలీసులు వివిధ సెక్షన్ల కింద తిరిగి అభియోగాలు నమోదు చేసి కొడాలి నాని అనుచరులను అరెస్ట్ చేశారు. అప్పట్లో కొడాలి నాని అనుచరులకు గుడివాడ గడ్డం బ్యాచ్ అని పేరుండేది. ప్రస్తుత కేసులకు సంబంధించి .. ఆ గడ్డం బ్యాచ్‌లో కీ రోల్ పోషించిన కృష్ణాజిల్లా వైసీపీ అధ్యక్షుడు మెరుగుమాల కాళీ పరారీలో ఉన్నాడట. అతను అస్సాం రాష్ట్రానికి పరారైనట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందంతో గాలింపుచర్యలు చేపడుతున్నారంట.వైసీపీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతల చేసినా అరాచకాలపై.. నమోదైన కేసులను పోలీసులు తిరగతోడుతున్నారు. వరుస అరెస్టులతో.. వైసీపీ అరాచక వాదుల వెన్నులో వణుకు మొదలైంది. వైసీపీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు చేసిన ఓవరాక్షన్ అంతా ఇంతా కాదన్న ఆరోపణలున్నాయి. ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా ఇష్టానుసారం వ్యవహరించారు. టీడీపీ కార్యకర్తలు మొదలుకుని నేతలు.. ఆఖరికి పార్టీ ఆఫీసులను కూడా ధ్వంసం చేసిన సందర్భాలు కోకొల్లలు. సీన్ కట్ చేస్తే.. ఐదంటే ఐదేళ్లలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో నాడు చెలరేగిపోయిన వారి భరతం పడుతున్నారు.ఇప్పటికే మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం, గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడికి సంబంధించి వరుస అరెస్టులు జరుగుతుండగా.. కృష్ణా జిల్లా గుడివాడ టీడీపీ కార్యాలయంపై దాడి వ్యవహారం బయటి తీశారు. దీంతో గుడివాడ వైసీపీ నేతలకు ఉచ్చు బిగుస్తోంది. మాజీ మంత్రి కొడాలి నాని టార్గెట్‌గా ఏపీ పోలీసులు చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలోకి ఉండగా కొడాలి నాని, ఆయన అనుచరులు గుడివాడ టీడీపీ నేతలు.. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావును తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనకూడదని రావి వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి మరీ వైసీపీ నేతలు బెదిరించారు. ఆఖరికి టీడీపీ కార్యాలయంలో ఉన్న రావి, ఇతర టీడీపీ నేతలపై కత్తులు, కర్రలు, ఇనుప రాడ్లు, పెట్రోల్ ప్యాకెట్లతో వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. అయితే ఇంత జరుగుతున్నా అప్పటి సీఐ ప్రోద్భలంతో పోలీసులంతా కొడాలి గ్యాంగుకే కొమ్మకాశారు.ఇప్పుడు సీన్ మారింది. దాడి తాలుకూ వీడియో ఫుటేజ్ ఆధారంగా నాటి దాడులపై కొడాలి నాని అనుచరులపై కేసులు నమోదు చేశారు. మరోవైపు గుడివాడ కే కన్వెన్షన్‌లో జరిగిన క్యాసినో వ్యవహారంపై నిజనిర్ధారణకు వచ్చిన టీడీపీ కమిటీపై జరిగిన దాడులకు సంబంధించి పోలీసులు తాజాగా విచారణ చేపట్టారు. కొడాలి నాని క్యాసినో వ్యవహారంపై గుడివాడ వచ్చిన నిజ నిర్ధారణ కమిటీ నేతలపై దాడులు జరిగిన అందరికీ తెలిసిందే. కార్లు ధ్వంసం, గుడివాడ టీడీపీ కార్యాలయంపై దాడి, ఫర్నిచర్ ధ్వంసం

ఘటనలలో నాడు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని టీడీపీ నేతలపైనే పోలీసులు కేసులు నమోదు చేశారు.మొత్తానికి చూస్తే.. కొడాలి నాని టార్గెట్‌గా చర్యలకు ఏపీ పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నానిపై పలు కేసులు నమోదయ్యాయి. తాజాగా కొడాలి నాని అనుచరులను అరెస్ట్ చేయడంతో కొడాలి నానికి ముహూర్తం పెట్టేసినట్లే అంటున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత జగన్ ప్రజాక్షేత్రంలోకి వస్తానంటు?నారు. అప్పుడు ఆయన బయటకు వచ్చినప్పుడే కొడాలి నాని అరెస్టుకి ముహూర్తం పెడతారన్న టాక్ వినిపిస్తుంది.

# అనంతలో జేసీ జగడం

అనంతపురం, డిసెంబర్ 9,జేసీ ప్రభాకర రెడ్డి సొంత పార్టీ నేతలకే కాదు.. సొంత సామాజికవర్గం నేతలకు కూడా విలన్ గా మారారు. ఆయన పెట్టుకుంటున్న విభేదాలు ఆయనకు మరింత ఇబ్బందిని తెచ్చి పెడతాయంటున్నారు. అనంతపురం జిల్లాలో జేసీ కుటుంబానికి ఒక హిస్టరీ ఉంది. అదే సమయంలో జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో జేసీ వేలు పెట్టడంతో అనేక మంది సొంత పార్టీ అంటే టీడీపీ నేతలే వ్యతిరేకమయ్యారు. జేసీ ప్రభాకర్ రెడ్డి తమ నియోజకవర్గాల్లో వేలు పెట్టడమేంటని పుటపర్తి, అనంతపురం, రాయదుర్గం, కల్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ నేతలనే తన శత్రువులుగా మార్చుకున్నారు. అక్కడ తన అనుచరులకు అందం ఎక్కించాలన్న ఆశతో ఆయన అక్కడ ఉన్న అసలైన నేతలకు దూరమయ్యారు. అందుకే గత ఎన్నికల్లో జేసీ కుటుంబానికి కేవలం తాడిపత్రి నియోజకవర్గమే అధినాయకత్వం ఇచ్చింది. అనంతపురం పార్లమెంటు స్థానం కావాలని భావించినా చంద్రబాబు నాయుడు అంగీకరించనది జిల్లా నేతల నుంచి జేసీ పై వస్తున్న వ్యతిరేకతే కారణం. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శత్రువులను పెంచుకుని కత్తి లేకుండా జేసీ యుద్ధం చేస్తున్నారు. జేసీ దివాకర్ రెడ్డి కొంత రాజకీయంగా యాక్టివ్ గా ఉన్న సమయంలో ఇంతటి వ్యతిరేకత లేదు. అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి నాయకత్వ బాధ్యతలను తీసుకున్న తర్వాతే ఎక్కువ విభేదాలు తలెత్తాయని అంటారు. జేసీ దివాకర్ రెడ్డి?తో పోలిస్తే ప్రభాకర్ రెడ్డి దూకుడుగా ఉండటమే కాకుండా, మాటలు కూడా కటువుగా ఉండటంతో పార్టీ నేతలే ఆయనకు దూరంగా ఉండటం ప్రారంభించారు. ఎవరూ ఆయన వద్దకు వెళ్లి పలకరించే సాహసాన్ని కూడా చేయరు. కనీసం ఆయనను పార్టీ నేతగా చూసే అవకాశాన్ని కూడా వారు ఇవ్వడం లేదు. ఏమాత్రం తాము తగ్గినట్లు కనిపిస్తే తమ నియోజకవర్గంలో ఎక్కడ వేలుపెడతారో? అన్న సందేహంతో జేసీ తో అంటీముట్టనట్లు వ్యవరిస్తున్నారు. పార్టీ అధినాయకత్వానికి లెక్కకు మించిన సార్లు ఫిర్యాదుకూడా చేశారు. అయితే తాడిపత్రిలో ఉన్న బలం, బలగాన్ని పార్టీ హైకమాండ్ ఆయనకు ఆ మాత్రం ప్రయారిటీ అయినా ఇస్తుందన్నది వాస్తవం. మరోవైపు తాజాగా బీజేపీకి చెందిన ఆదినారాయణరెడ్డి తో కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి వైరానికి దిగారు. కడప ఆర్టీపీపీ విషయంలో నేరుగా కయ్యానికి దిగడంతో ఇప్పుడు ఆది వర్గం కూడా జేసీ పై గుర్రుమంటోంది. కడప జిల్లాలో జేసీ పెత్తనమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారు. అయితే ఇందుకు జేసీ ససేమిరా అనడంతో ఇది చినికి చినికి గాలివానలా మారి ముఖ్యమంత్రి వద్దకు పంచాయతీ చేరింది. పంచాయతీకి కూడా రాకుండా జేసీ ప్రభాకర్ రెడ్డి దూరంగా ఉండి నేనింతే నని సంకేతాలను పంపడంతో ప్లై యాష్ విషయంలో చివరకు ఆదినారాయణ రెడ్డి వర్గానిదే పై చేయిగా మారింది. రాజీ దోరణి అనేది ఉండదు. అలాగే సంయమనంతో సమస్యను పరిష్కరించుకుందామన్న ధ్యాస ఉండదు. కేవలం దూకుడుగా వెళ్లి తనకు కావాల్సిన పనిని తాను చేసుకుందామని ఆయన భావించడమే ఇప్పుడు జేసీ వర్గానికి మింగుడు పడటం లేదు.

కానీ ఆయన వద్ద నేరుగా ప్రస్తావించలేని కొందరు తమ వ్యాపారాల కోసం ఇతర మార్గాలన చూసుకుంటున్నారు. ఆదినారాయణ రెడ్డి పేరుకు బీజేపీలో ఉన్నా ఆయనకు టీడీపీలో ఉన్న నేతల మద్దతు పుష్కలంగా ఉండటంతో జేసీ బూడిద కాంట్రాక్టు విషయంలో ఒంటరియ్యారనే చెబుతున్నారు?. అందుకే పార్టీ అధినాయకత్వం కూడా ఆది నారాయణ రెడ్డి వెంట ఉండటంతో జేసీకి అర్థమయినా ఆయన దూకుడు మాత్రం ఆగడం లేదు. . ఇక తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నియోజకవర్గంలోకి అడుగు పెట్టకుండా చేస్తున్నారు. సరే.. ఆయనంటే నియోజకవర్గంలో శత్రువుగా పరిగణించవచ్చు. కానీ అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి తో కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి గొడవకు దిగారు. అనంతపురంలో కళాశాల స్థలాన్ని అనంత వెంకట్రామిరెడ్డి ఆక్రమించకున్నారని, దానిని తిరిగి తాను ప్రభుత్వం స్వాధీనం చేస్తానని చెబుతున్నారు. దీంతో సొంత సామాజికవర్గం నేతలతో ఈ గొడవలేంటని పలువురు నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ జేసీ ఆగడం లేదు. తాను అనుకున్న దారిలోనే ఆయన వెళుతున్నారు తప్పించి ఎవరి సలహాలు స్వీకరించకపోతుండటం కూడా జేసీ ప్రభాకర్ రెడ్డిపై కొంత వ్యతిరేక రెడ్డి సామాజికవర్గంలో పెరగడానికి కారణమయిందని చెప్పాలి. జేసీ ప్రభాకర్ రెడ్డి తాను తాడిపత్రి వరకూ పరిమితమయి అక్కడే రాజకీయాలు చేసుకుంటే ఎవరికీ ఇబ్బంది ఉండదు. కానీ అదే తాను అన్ని నియోజకవర్గాల్లో వేలు పెట్టాలని చూస్తూ అందరూ ఏకమై జేసీని ఏకాకిని చేయడం ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పటికే జేసీ ఏకాకి అయ్యారన్న వారు అనేక మంది ఉన్నారు. మరి జేసీ ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకుంటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

## ఎమ్మిగనూరులో 15 బంతుల్లో 39 రన్స్ చేసిన క్రికెటర్..



విభారే న్యూస్ డిసెంబర్ 09 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా కొనసాగుతోంది. సోమవారం హైటెక్ 11, ఎంసీ లెవెన్ జట్లు తలపడ్డాయి.ఇందులో హైటెక్ 11 జట్టు గెలుపొందింది.హైటెక్ లెవెన్ జట్టు క్రీడాకారుడు వెంకీ 15 బంతుల్లో 39 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు.

## 31 వ వార్డు లో ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే బీవీ...



విభారే న్యూస్ డిసెంబర్ 09 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా 31వ వార్డు, యల్లమ్మబీడు కాలనీ నుండి వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి పెట్టారు. వార్డులో అధికారులతో కలిసి పర్యటిస్తూ అక్కడి రోడ్లు,డ్రైనేజీ, తాగునీటి సరఫరా,వీధి లైట్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనగేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.మునిసిపల్ కమిషనర్, అధికారులు, ఎలక్ట్రికల్ ఏఈ,వార్డు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం..

### మానవ హక్కుల - ఇస్లాం సెమినార్..

విభారే న్యూస్ డిసెంబర్ 09 ఎమ్మిగనూరు..నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భం ను పురస్కరించుకొని ఖురేషి ఫంక్షన్ హాలు నందు మానవహక్కులు ఇస్లాం సెమినార్ ను ఏర్పాటు చేయడం జరిగినది. సాయంత్రం 6:00 గం. ల నుండి 8.00 గం. ల వరకు ముఖ్య అతిథులు హాజరై వారి ఉపన్యాసంను ప్రసంగించెదరు. కన్వీనర్ మౌలానా అబూబక్ర్..సెల్ నెంబరు:8886826928.. జమాతే ఇస్లామి హింద్, ఎస్ ఐ ఓ వారి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడును.




## దేశ ప్రధాని పదవినే త్యాగం చేసిన సోనియా గాంధీ...

### - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ..



విభారే న్యూస్ డిసెంబర్ 09 కర్నూలు జిల్లా ప్రతినిధి.. దేశ అత్యున్నత ప్రధాని పదవినే తృణప్రాయంగా తిరస్కరించి త్యాగం చేసిన శ్రీమతి సోనియా గాంధీ త్యాగశీలి అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు పాలకమండలి మాజీ సభ్యులు,పరిగెల మురళీకృష్ణ ఆమె త్యాగాన్ని అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు శ్రీమతి సోనియా గాంధీ బర్తడే సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీమతి సోనియా గాంధీ అంది వచ్చిన ప్రధాని పదవినే తృణప్రాయంగా తోచిపుచ్చి పార్టీ సీనియరయిన ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ ని ప్రధాని పదవి సీట్లో కూర్చోబెట్టిందని ఆమె పార్టీ కోసం చేసిన త్యాగాలను కొనియాడారు. అధికారం కోసం వెంపర్లాడే ఈ రోజుల్లో ప్రధానమంత్రి పదవిని సైతం తీసుకోకుండా మన్మోహన్ సింగ్ ని రెండుసార్లు అనగా పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ప్రధానమంత్రిగా చేసిన ఘనత సోనియా గాంధీకే దక్కిందనీ వారి కుటుంబంలో ఇందిరాగాంధీ, సోనియా గాంధీ భర్త మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ దారుణ హత్యలకు గురైన కూడా భయపడకుండా దేశ భద్రత కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి తన ఇద్దరు పిల్లలను కూడా ప్రజల్లోకి పంపి ప్రజాసేవకే అంకితం అవమని పంపించిన ఘనత సోనియా గాంధీ కే దక్కుతుందనీ కావున దేశ భవిష్యత్తు దృష్ట్యా కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోనికి తీసుకువచ్చి వారి కుటుంబ త్యాగాలకు సార్ధకత చేకూర్చారని ఈ సందర్భంగా మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. ముందుగా శ్రీమతి సోనియా గాంధీ పేరుతో కేక్ కట్ చేసి శ్రీమతి సోనియా గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు అంటూ నినాదాలు చేశారు.అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర బాబు, కర్నూలు సిటీ అధ్యక్షులు షేక్ జిలాని భాష, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు యన్ సి బజారన్న, కె సత్యనారాయణ గుప్త, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ప్రధాన కార్యదర్శి,ఎన్ సుంకన్న,ఎస్ ప్రమీల, అనంతరత్నంమాదిగ, బి సుబ్రహ్మణ్యం,షేక్ మాలిక్, జాన్ సదానందం,అబ్దుల్ హై,పశుపల ప్రతాపరెడ్డి, రమేష్,అక్బర్, రంగస్వామి ఐఎన్టియుసి నాయకులు ఆనందం, మహేష్, మహిళా కాంగ్రెస్ హైమావతి,సుజాత, మల్లేశ్వరి, రమణమ్మ ,శ్రీలత, మాణిక్యాలు,సలోమి మొదలు వారు పాల్గొన్నారు..

## ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై ధర్నా..




విభారే న్యూస్ డిసెంబర్ 09 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు పట్టణంలో మునిసిపల్ పరిధిలో పనిచేస్తున్నటువంటి పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు యల్లప్ప, శివకృష్ణ ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మ గురుడు వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత ప్రభుత్వము ఇంజనీరింగ్ వర్కర్స్ ద ఆఫీస్ వర్కర్స్ కు గత ప్రభుత్వం ఇచ్చినటువంటి మినిట్స్ ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి తీర్పు ప్రకారం ప్రతి కార్మికునికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఆక్యూపెన్సి పెంచాలని సరెండర్ లీవులు ఇవ్వాలని ఎమ్మిగనూరు మున్సిపల్ పరిధిలో పనిచేస్తూ మరణించినటువంటి పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగనీ ఇవ్వాలని క్లాప్ డ్రైవర్స్ ని విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలని అదనంగా కార్మికులను తీసుకోవాలని వారన్నారు.ధర్నా అనంతరం మునిసిపల్ మేనేజర్ వరప్రసాద్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు చిన్న రంగడు,హరిప్రసాద్, ఈరన్న,సోమయ్య, ఎఐటియూసి నాయకులు విజయేంద్ర,కాజా, నరసింహులు,రామంజి, ఖాదర్,సమీర్,మదిలేటి, నరసింహులు,నాగరాజు, ఇస్మాయిల్,తదితరులు పాల్గొన్నారు..

## 11వ తేదీ పట్టణంలో జరగాల్సిన రెవెన్యూ సదస్సు నేడే(10 వ తేది) జరుగును..

విభారే న్యూస్ డిసెంబర్ 09 ఎమ్మిగనూరు..ఈ నెల 11 వ తేదిన ఎమ్మిగనూరు పట్టణము నందు జరగవలసిన రెవెన్యూ సదస్సు 10వ తేదిన ఎమ్మిగనూరు పట్టణం లోని కుర్ని కళ్యాణ మండపం నందు జరుగును. 10వ తేదీన కడిమెట్లలో జరగవలసిన రెవెన్యూ సదస్సు 11 తేదీన జరుగుచున్నది. మిగతా గ్రామాల్లో షెడ్యూలు ప్రకారమే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం యధావిధిగా జరుగుతుంది. రెవెన్యూ సదస్సులు ఉదయం 9.00 నుండి సాయత్రం 5.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలియజేయదమైనది. మీకు ఎటువంటి భూ సమస్యలు ఉన్న ఎడల మీరు అర్జీలు సమర్పించి ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ తెలిపారు..

## ఉద్యోగుల పాత బకాయిలు వెంటనే చెల్లించాలి: ఆప్టా

విభారే న్యూస్ డిసెంబర్ 09 కర్నూలు జిల్లా ప్రతినిధి..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి సుమారు ఆరు నెలలకు కావస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉపాధ్యాయుల పెండింగ్లో ఉన్న పాత బకాయిలు ఊసే లేదని ఓటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉద్యోగుల పాత బకాయిలు వెంటనే చెల్లిస్తాదని ఆశపడిన ఉద్యోగులకు నిరాశ తప్పడం లేదు, కావున ముఖ్యమంత్రివర్యులు వెంటనే ఉద్యోగుల పాత బకాయిలను చెల్లించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ జి ఎస్ గణపతి రావు ,కె ప్రకాష్ రావుల కోరారు ,2022 సంవత్సరము మే నెల నుంచి ఇప్పటివరకు పెట్టిన ఉపాధ్యాయుల సరెండర్ లీవులు, ఇతర బకాయిలు ఎవరికీ చెల్లించబడలేదని కావున ప్రభుత్వం వెంటనే క్రిస్టమస్ పండగ సందర్భం గా ఆయన ఆ బకాయిలు చెల్లించేలా చర్యలు గై కొనాలని వారు ప్రభుత్వాన్ని కోరారు అలాగే కొత్త పిఆర్సి కమిషన్ వెంటనే నియమించి ఉద్యోగులకు ఐఆర్ ప్రకటిస్తారని వారు ఆశిస్తున్నారు కావున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంలో చర్య తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు, ప్రభుత్వాలు మారిన ఉపాధ్యాయుల అగచాట్లు తప్పడం లేదని వంద రోజుల ప్రణాళిక పేరుతో ఉపాధ్యాయులకు ఆదివారం కూడా 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలకు వెళ్లి బోధన అభ్యసన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రణాళికలు ఇవ్వడం ఇబ్బందికరంగా ఉందని చాలామంది ఉపాధ్యాయులు వాపోతున్నారని వాళ్ళు తెలియచేశారు ఎస్ సి ఆర్ టి డైరెక్టర్ వారిచ్చిన 100 రోజుల ప్రణాళికలో సంక్రాంతి సెలవుల్లో కూడా పనిచేయాలని ఇవ్వడం చాలామందికి ఇబ్బందిగా ఉందని వారు తెలియజేశారు,సమీప గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలలకు వస్తున్న బాలికలు సాయంత్రం 5 గంటల తర్వాత చీకటి పడుతుండటం వల్ల వారి గ్రామాలకు వెళ్ళేటప్పుడు అనుకోని దుష్ట సంఘటనలు జరిగే అవకాశం ఉన్నందున ఈ విషయమై విద్యాశాఖ మంత్రివర్యులు ఆలోచించాలని అప్టా సంఘం తరఫున వారు కోరారు



## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 123 ఫిర్యాదులకు విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం. - జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్...

విభారే న్యూస్ డిసెంబర్ 09 కర్నూలు జిల్లా ప్రతినిధి..ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 123 ఫిర్యాదులు.వృద్దులు, దివ్యాంగుల వద్దకు వెళ్ళి ఫిర్యాదులు స్వీకరించి భరోసా కల్పించిన జిల్లా ఎస్పీ.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 123 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని1) కర్నూలు రేడియో స్టేషన్ లో గవర్నమెంట్ అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలు కు చెందిన చంద్రశేఖర్,శ్రీకాంత్ లు రూ.18 లక్షలు తీసుకొని మోసం చేశారని కర్నూలు మండలం,ఎదురూరు గ్రామానికి చెందిన శివకుమార్ ఫిర్యాదు చేశారు. 2) కర్నూలు జోహారాపురం కు చెందిన శ్రీనివాసులు కర్నూలు కోట్ల రైల్వేస్టేషన్ లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని ఎ వి ఆర్ ఇన్ఫోటెక్ అనే పేరుతో ఐడి కార్డు ఇచ్చి డబ్బులు తీసుకొని మోసం చేశాడని కల్లూరు మండలం కు చెందిన ప్రసాద్ ఫిర్యాదు చేశారు. 3)గవర్నమెంట్ హాస్పిటల్ లో ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలు కు చెందిన శివాజీ అనే వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశాడని కర్నూలు మండలం, నూతన పల్లె గ్రామానికి చెందిన వంశీనాథ్ ఫిర్యాదు చేశారు. 4)మా పొలంకు ఉన్న వాటర్ పైప్ లైన్ కట్ చేసి కాల్వ పూడ్చిన వారి పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కల్లూరు మండలం, పుసులూరు గ్రామంకు చెందిన తిమ్మారెడ్డి ఫిర్యాదు చేశారు. 5) కైరుప్పల గ్రామానికి చెందిన కుమ్మరి వీరభద్రి కొందరు వ్యక్తులతో కలిసి ఫోర్జరి సంతకాలతో నాకు చెందిన ఒక ఎకర,యాభై నాలుగు సెంట్ల పొలాన్ని ఆక్రమించుకున్నారని ఆస్పరి మండలం, కైరుప్పల గ్రామానికి చెందిన ఎస్ బి ఐ రిటైర్డ్ విజయ్ మోహన్ ఫిర్యాదు చేశారు. 6)కర్నూలు లో మెడికల్ షాపులో పని చేస్తున్నాను. రెహాన్ అనే వ్యక్తి అడ్వకేట్ గా పని చేస్తున్నాని చెప్పి పరిచయం అయి బ్యాంకు లోన్ ఇప్పిస్తానని,భూ సమస్యలు పరిష్కరిస్తానని రూ. ఒక లక్ష 50 వేలు తీసుకొని చీటింగ్ చేశాడని ఓర్వకల్లు మండలం, ఓర్వకల్లు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. 7)పంచలింగాల దగ్గర ఉన్న ఒక ఎకర 80 సెంట్ల పొలానికి డబ్బులు తీసుకున్న వ్యక్తులు రిజిస్టర్ చేయడం లేదని న్యాయం చేయాలని కర్నూలు అశోక్ నగర్ కు చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. 8)గాయత్రి ఎస్టేట్ లోని ఒక మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసిన వ్యక్తి డబ్బులు ఇవ్వడం లేదని కర్నూల్ కు చెందిన తలారి రోహిత్ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి,బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సిఐ శివశంకర్ పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**